క్లుప్తంగా

రాష్ట్ర గవర్నర్‌కు స్వాగతం



తిరుమలలో గవర్నర్‌తో అనిల్‌కుమార్ సింఘాల్, టీటీడీ ఈవో, కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండ్రోజుల పర్యటన నిమిత్తం ఉదయం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, వేదిక్ వర్సిటీ వీసీ సదాశివమూర్తి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషా స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుపతి ఎస్వీ వేదిక్ వర్సిటీలో 7వ కాన్వొకేషన్‌కు హాజరై, మధ్యాహ్నం తిరిగి రేణిగుంట విమానాశ్రయం నుంచి కడప జిల్లాకు వెళ్లారు. ఆయనకు జేసీ బాలాజీ, ఆర్డీఓ రామారావు, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ రాజ్ కిషోర్, లైజాన్ ఆఫీసర్ చెన్నయ్య, సీఎస్‌ఓ రాజశేఖర్‌రెడ్డి వీడ్కోలు పలికారు. కడప పర్యటన అనంతరం గవర్నర్ తిరిగి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని తిరుమలకు వెళ్లారు.

నేడు మద్యం సమస్యకు పరిష్కారంపై అవగాహన

తిరుపతి కల్చరల్: ఆల్కాహాలిక్స్ అనోనమస్ గ్రూప్ తిరుపతి శాఖ ఆధ్వర్యంలో శనివారం టీపీపీఎం స్కూల్లో తాగుబోతుతనం వ్యాధి, సమస్యకు పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఘనంగా స్కూల్ వార్షికోత్సవం

పాకాల: మండలంలోని అచ్చమ్మ అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమంలో అనేక మౌలిక వసతులు కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం జార్జ్ పాల్గొన్నారు.

అన్నదాత సంక్షేమమే ధ్యేయం

భాకరాపేట: అన్నదాత సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పనిచేస్తున్నారని చిన్నగొట్టిగల్లు సర్పంచ్ మనోహర్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు అక్బర్ తెలిపారు. చిన్నగొట్టిగల్లు వారపు సంతలో శుక్రవారం రైతులకు అల్పాహారం అందజేశారు. రైతులు మాట్లాడుతూ రైతులు పస్తులతో ఉండకుండా అన్నం పెట్టే చెవిరెడ్డి కుటుంబం చల్లగా ఉండాలని దీవించారు. మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నేతలు లోకనాథరెడ్డి, ఇర్షాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి జ్యోతిష్య సమ్మేళనం

తిరుపతి కల్చరల్: ఇస్కాన్ మందిరం సమీపంలోని రిక్రియేషన్ హాల్లో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి జ్యోతిష్య సమ్మేళనం నిర్వహించనున్నట్టు కంచిపీఠం ఆస్థాన సిద్ధాంతి ఎల్.విజయ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మానవుని హితం కోరే జ్యోతిష్యం విలువను ప్రపంచానికి తెలియజేయాలనే ఆశయంతో జ్యోతిష్య సమ్మేళనం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో వ్యవసాయం– జ్యోతిష్యం, జ్యోతిష్యరీత్యా ప్రకృతి పరిశీలన, నిజ జీవితంలో జ్యోతిష్య శాస్త్ర ఉపయోగం, నామ నక్షత్ర వివేకం, పంచాంగ గణనం– ఖగోళ పరిశీలన, ఖగోళ యంత్రాల ద్వారా గ్రహ సాధన, మేఘ మాలికా శాస్త్రం వంటి అరుదైన అంశాలపై పండితులు వ్యాసాలను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేస్తారని తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రామిరెడ్డిగారిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వర్సిటీల్లో జరిగే స్నాతకోత్సవాన్ని తలపించేలా విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

మండే కాలం

రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలకే సూర్యుడు భగభగ మండుతున్నాడు. తిరుపతి నగర ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. అత్యవసరమై వచ్చేవారు తప్పనిసరిగా గొడుగులు, నెత్తిన టవళ్లు ధరిస్తున్నారు. మహిళలు ముఖానికి స్కార్ఫ్‌లు కట్టుకుంటున్నారు. కళ్లకు చలువ అద్దాలు ధరించి తిరుగుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయంతోపాటు మజ్జిగ సేవిస్తున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



గొడుగు నీడన పిల్లలను తీసుకెళుతున్న మహిళ



ఎండకు తలపై ఓనీ కప్పుకుని వెళుతున్న మహిళ



ముఖాలకు స్కార్ఫ్ కట్టుకుని వెళుతున్న మహిళలు



వాహనానికి నీడను ఏర్పాటుచేసుకున్న వ్యక్తి

రైతులను అరాచకాలకు పురికొల్పడం దుర్మార్గం

తిరుపతి కల్చరల్: విద్యుత్ మీటర్లను ధ్వంసం చేయాలని రైతులను పురికొల్పడం దుర్మార్గమని, ఇలాంటి వ్యాఖ్యలు సమాజానికి మంచిది కాదని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హితవు పలికారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబునాయుడు, లోకేష్ అధికార దాహం కోసం రైతులను అరాచకవాదులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. కరువులో విద్యుత్ చార్జీలు కట్టలేని నిస్సహాయ స్థితిలోనున్న రైతులపై పోలీస్ కేసులు పెట్టించి జైల్లో కుక్కిన చరిత్ర చంద్రబాబుదన్నారు. అలాగే బషీర్‌బాగ్‌లో నిరసన కారులను గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పించి అమాయకులను పొట్టన పెట్టుకున్నారని దుయ్యబట్టారు. రైతుకు నిరంతరాయంగా విద్యుత్ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీటర్లు పెడుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ రైతుల్లో అలజడి సృష్టించి రాజకీయ లబ్ధిపొందాలని టీడీపీ నేతలు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత విద్యుత్ వాడుకున్నప్పటికీ మొత్తం చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించి పైలెట్ ప్రాజెక్టు నిర్వహించారని గుర్తు చేశారు. ఫలితంగా జిల్లా రైతాంగమంతా ఈ కొత్త విధానంతో హర్షం వ్యక్తం చేశారని తెలిపారు.

పల్లెకు ఫ్యామిలీ డాక్టర్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధారాణి

చంద్రగిరి(తిరుపతి రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను శుక్రవారం చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లిలో డాక్టర్ శివాజీ, ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ రవినాయుడు ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించారు. హెల్త్ సూపర్ వైజర్ కామరాజు గ్రామంలో సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఫ్రైడే డ్రై డే నిర్వహిస్తూ దోమల వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి తనిఖీ చేశారు. 'పరిశుభ్రతే ఆరోగ్యానికి తొలిమెట్టు' నీ, సరైన పరిష్కార మార్గం అదేనన్ని పేర్కొన్నారు.

కోట్లు మోసం చేశారు.. న్యాయం చేయండి

- టీటీడీ ఏడీ బిల్డింగ్ వద్ద ఎన్‌ఆర్‌ఐ మధుసూదన్‌రెడ్డి నిరసన



నిరసన తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: భూములు కొనిస్తామంటూ టీటీడీ ఉద్యోగి వెంకటరమణారెడ్డి రూ.కోట్లు మోసం చేశాడని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం, కొత్రమంగళం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఎస్.మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం టీటీడీ ఏడీ బిల్డింగ్ గేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం టీటీడీ ఈవోకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాను వృత్తి రీత్యా అమెరికాలోని వర్జీనియాలో స్థిరపడ్డానని తెలిపారు. తన అక్క ఉషారాణి భర్త (డీఆర్ మహల్ వద్దనున్న సత్రంలో సీనియర్ అసిస్టెంట్)గా విధులు నిర్వహిస్తున్న గంపల వెంకటరమణారెడ్డి తిరుపతిలో భూములు కొంటే భవిష్యత్తు బాగుంటుందని చెప్పి తననుంచి రూ.కోట్లు తీసుకున్నారని తెలిపారు. ఆ డబ్బుతో భూములు కొని ఆయన బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాపోయారు. ఈ విషయం గురించి అడిగితే తనను దుర్భాషలాడుతూ దాడికి ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను టీటీడీ ఉద్యోగ సంఘం నేతనని, టీటీడీ హౌసింగ్ బోర్డు చైర్మన్‌నని, నీవు ఏమీ చేయలేవని దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఆయనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

జడ్జిలకు ఘన సన్మానం



ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావును సన్మానిస్తున్న న్యాయవాదులు



అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి శిరీష్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు



జడ్జి సులోచనారాణితో న్యాయవాదులు

తిరుపతి లీగల్: బదిలీ అయిన తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష్‌ను శుక్రవారం సాయంత్రం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. జడ్జిలు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు జడ్జి నాగరాజు, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయమూర్తి సులోచనారాణి బదిలీ

పాకాల: స్థానిక కోర్టు న్యాయమూర్తి బీవీ.సులోచనారాణి గూడూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుకు బదిలీ అయ్యారు. చిత్తూరు మూడో అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్ పాకాల జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో జడ్జి సులోచనారాణిని పాకాల బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు ఘనంగా స్వాగతించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప నాయుడు, కార్యదర్శి గౌరీశంకర్‌రాజు, సీనియర్ న్యాయవాదులు సుబ్రమణ్యంరెడ్డి, గురుస్వామినాయుడు, సలీం, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

తిరుపతి తుడా: ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్, మురళి కోరారు. వారు శుక్రవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతినెలా సకాలంలో జీతం వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కార్యదర్శి బాలాజీ ఉన్నారు

రేపు వాసవీ జయంతి

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు పాలక మండలి కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. అలాగే 102 మంది కన్యలతో కుంకుమార్చన చేయిస్తున్నట్టు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. సమావేశంలో ఆలయ పాలక మండలి కన్వీనర్ మహేష్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, శ్రీరాములు, లక్ష్మణ్, రవిచంద్ర పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో జార్ఖండ్ గవర్నర్



జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను సత్కరిస్తున్న ఏఈఓ ప్రభాకర్ రెడ్డి తదితర నాయకులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బీజేపీ రాష్ట్ర నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు.

నేడు, రేపు మహతిలో అమృతగాన నీరాజనం

తిరుపతి కల్చరల్: ఘంటసాల, ఎన్‌టీఆర్, సాలూరు రాజేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా శని, ఆదివారాల్లో మహతి కళాక్షేత్రంలో అమృతగాన నీరాజనం కార్యక్రమం చేపడుతున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు జరిగే కార్యక్రమంలో సినీ, మా టీవీ, జీ టీవీ గాయనీ గాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రతి గుండెలోనూ జగనన్నే



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: దేశంలో ఏ రాజకీయ నాయకుడూ అందించలేనన్ని సంక్షేమ పథకాలు అమలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గుండెలోనూ స్థిరంగా నిలిచిపోయారని తిరుపతి 21వ డివిజన్ ఎంఆర్‌పల్లి ప్రజలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి శుక్రవారం కార్పొరేటర్ ఈశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్ ఆధ్వర్యంలో 21వ డివిజన్‌లోని ఎంఆర్‌పల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా పలకరిస్తూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తిరుపతి ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే తిరుపతిని మహానగరంగా తీర్చిదిద్దాలన్నదే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ధ్యేయమన్నారు. కుల మతాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్లు ఆరణి సంధ్య, నరసింహ ఆచారి, పార్టీ నాయకులు వెంకటమునిరెడ్డి, శేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, అనీల్, నాగరాజు, మనోహర్‌రెడ్డి, బాష, మునిబాబు, జయ, జీవన్, గోపీనాథ్ పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సుపరిపాలన



చిట్టెచెర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చాక్లెట్స్ అందజేస్తున్న మోహిత్‌రెడ్డి

- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
- దీన్‌దార్లపల్లెలో రూ.10.25 కోట్లతో పనులు

భాకరాపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల, దీన్‌దార్లపల్లె పంచాయతీల్లో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పరిపాలన సాగిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు.

రూ.10.25 కోట్లతో అభివృద్ధి పనులు

దీన్‌దార్లపల్లె పంచాయతీలో రూ.10.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మోహిత్‌రెడ్డి తెలిపారు. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు ఉపశమనం కల్పించినట్లు వివరించారు. సర్పంచ్ ఖుర్షీద్‌బీ, మాజీ ఎంపీటీసీ రాజారెడ్డి, పంచాయతీ కన్వీనర్లు శ్రీధర్‌రెడ్డి, చిట్టెమ్మ, ప్రతాప్‌రెడ్డి, సాదిక్‌అలీ, సిద్ధిక్, ఉప సర్పంచ్ అబిద, మణి, వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ విజయకుమారి, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి చిరునామా సీఎం జగన్

తిరుమల: సంక్షేమం పేరుతో గుర్తుకు వచ్చే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎంపీ మార్గాని భరత్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దేశంలో ఆదర్శవంతమైన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. తిరుమలలో ఆరు నెలల కాలంలోనే శుభ్రత, పచ్చదనం చాలా మెరుగుపడిందన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టడంలో టీటీడీ తీసుకొచ్చిన శ్రీవాణి పథకం మంచి సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అదేవిధంగా జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. దేశంలో వివిధ సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నా ఒకటిగా ఉంచేది హిందూ సంప్రదాయమేనని

మాత్రిక డిజైనర్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: వేసవిని పురస్కరించుకుని కెన్సెస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ మాత్రిక డిజైనర్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం మేయర్ శిరీష ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ సరికొత్త కాటన్, ఫ్యాషన్, ఫ్యాన్సీ శారీస్, లహంగాలు, డ్రెస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. మాత్రిక డిజైన్స్ అధినేత ఉమా మహంతి మాట్లాడుతూ ఈ ప్రదర్శన శుక్ర, శని, ఆదివారాల్లో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

రేపు చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిబ్బాల వెంకట్రమణ తెలిపారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతర్గత విభేదాలను పక్కన పెట్టి అందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. చేనేతలకు వృత్తిపరమైన ప్రోత్సాహకాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు పేర్కొన్నారు. జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి సి.రమేష్, కార్యదర్శి ముదిశెట్టి శ్రీనివాసులు, సి.కల్యాణ్ చక్రవర్తి, గాలి దామోదరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మేయర్ శిరీష, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం వారు శుక్రవారం 90 మంది పేద ప్రతిభా విద్యార్థులకు రూ.7.96 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఇందులో మేయర్ శిరీష ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.8 వేలు, రూ.10 వేలు చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రతినిధులు ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. మలబార్ షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా విద్యలో ఉత్తమ ప్రతిభ చాటుతున్న 5,500 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేసి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జోనల్ హెడ్ నిఖిల్ చంద్రన్, సిబ్బంది పాల్గొన్నారు.